ప్రజాశక్తి

శుక్రవారం 19 జనవరి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

బాపట్లలో నోటీసులను చూపిస్తున్న అంగన్‌వాడీలు

ఎన్ని నోటీసులిచ్చినా

ధీటైన సమాధానం చెబుతాం..

38వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-బాపట్ల

సమ్మెను అణగదొక్కేందుకు ఎన్ని నోటీసులు ఇచ్చినా జీతాలు పెంచే వరకు ధీటైన సమాధానం ఇస్తామని బాపట్లలో అంగన్వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాపట్లలో గురువారం అంగన్‌వాడీల సమ్మె 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా బాపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీల యూనియన్ అధ్యక్షురాలు శైలశ్రీ మాట్లాడుతూ జీతాలు పెంచుతామని ప్రకటించే వరకు నిరాహారదీక్షకైనా సిద్ధమేనన్నారు. సమ్మె ప్రారంభించి 45 రోజులు కావస్తున్నా ముఖ్యమంత్రిలో కనీసం చలనం లేకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా జీతాలు పెంచుతామని ప్రకటన చేసే వరకు నారీమణుల శక్తి ఏంటో నిరూపించేందుకు విజయవాడలోనే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సీతామహాలక్ష్మి, గీత, లత, హేమమాలిని, శ్రీలత పాల్గొన్నారు.

కనిగిరి ఇన్‌ఛార్జిగా 'దద్దాల'

- నాలుగో జాబితాలో పేరు ఖరారు
- వైసిపిలో కొనసాగుతున్న కసరత్తు
- ఒంగోలు నుంచే బాలినేని పోటీ.!
- మార్కాపురంలో పోటీకి శిద్దా విముఖత
- అక్కడ సిట్టింగ్ నాగార్జునరెడ్డికే అవకాశం
- తేలని ఒంగోలు ఎంపీ అభ్యర్థి విషయం..

సిఎంను కలిసిన దద్దాల నారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి అధిష్టానం గురువారం రాత్రి విడుదల చేసిన నాలుగో జాబితాలో వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా హనుమంతునిపాడు జడ్పీటీసీ దద్దాల నారాయణయాదవ్ పేరును ప్రకటించింది. దద్దాల నారాయణ గురువారం సిఎం జగన్‌ను తాడేపల్లిలో కలిశారు. సాయంత్రమే ఆయన పేరును నాలుగో జాబితాలో వైసిపి ప్రకటించింది.

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సిఎం జగన్‌తో భేటీ అయ్యాక జిల్లాలో మిగిలిన స్థానాల్లో అభ్యర్థులపై భారీ మార్పుల దిశగా సమాలోచనలు సాగుతున్నాయి. సిఎం జగన్‌ను కలిసినప్పుడు బాలినేని అభ్యర్థులపై ఓ జాబితాను ప్రతిపాదించారు. అనంతరం విజయసాయిరెడ్డితో జరిపిన భేటీలోనూ వీటిపై లోతుగానే చర్చించారు. ఇందులో భారీ మార్పులు కనిపిస్తున్నాయి. ఒంగోలులో ఇళ్ల స్థలాలకు నిధుల విషయం తేలిపోయాక ఇక్కడ నుంచే పోటీకి బాలినేని పూర్తిగా నిర్ణయించుకున్నారు. గిద్దలూరు ఆలోచన వీడిపోయింది. బాలినేనిపై ఇప్పటివరకూ సాగుతున్న తర్జనభర్జనలకు తెరపడింది. ఇక మిగతా స్థానాల విషయానికి వస్తే మార్కాపురంలో నిన్నటివరకూ పార్టీ అధ్యక్షుడు జంకె పేరు పరిశీలనలో ఉంది. ఆర్థిక పరిస్థితుల రీత్యా ఆయన వ్యవహారం ఇప్పుడు పక్కకుపోయినట్లు సమాచారం. ఇక్కడ మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడు శిద్దా సుధీర్ పేరును మాజీ మంత్రి బాలినేని సిఎం జగన్ వద్ద ప్రతిపాదించారు. దీంతో గురువారం నాడు శిద్దా సుధీర్‌ను తాడేపల్లికి పిలిచి మాట్లాడారు. మార్కాపురంలో పోటీకి ఆయన విముఖత వ్యక్తం చేయడంతో అక్కడ మళ్లీ ప్రతిష్టంభన ఏర్పడింది. ఇదే విషయాన్ని సుధీర్ మాజీ మంత్రి బాలినేనికి కూడా చెప్పినట్లు సమాచారం. ఇక మార్కాపురం సిట్టింగ్ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిని ముందు గిద్దలూరుకు పంపాలని భావించినా శిద్దా నిర్ణయంతో ఈయన్ను ఇక్కడే ▶ 2లో

మాట్లాడుతున్న మంత్రి సురేష్

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి

▶ 2లో

విద్యుత్ షాక్‌తో

నాయనమ్మ, మనవరాలు మృతి

తోటవారిపాలెంలో ఘటన

ప్రజాశక్తి-చీరాల

విద్యుత్ ప్రమాదంలో నాయనమ్మ, మనవరాలు మృతిచెందిన ఘటన చీరాల మండలం తోటవారిపాలెం గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఈపురుపాలెం ఎస్సై జనార్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. తోటవారిపాలెంకు చెందిన భీమా సాంబయ్య భార్య శ్రీనివాసులు(23) తన ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ తీగలపై ఆరేసిన బట్టలను తీసే క్రమంలో.. పక్కనే ఉన్న కరెంటు తీగ నుండి విద్యుత్ ప్రసరించి.. ఆమె షాక్‌కు గురైంది.. దీంతో ఆమె పెద్దగా కేకలు వేయటంతో శ్రీనివాసులు నాయనమ్మ ఆట్ల కోటమ్మ(80) వెళ్లి పట్టుకోవడంతో ఆమెకు కూడా షాక్ కొట్టింది. ఇద్దరూ అక్కడికకకడే మృతిచెందారు. వీరి అరుపులు విని వచ్చిన మరో మనవరాలు గూడుబోయిన విజయలక్ష్మికి విద్యుత్ షాక్ తగిలినప్పటికీ ▶ 2లో

'నిమ్మ'కు తెగుళ్ల బెడద..

- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- ఆందోళనలో రైతులు

నిమ్మ తోట

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నిమ్మ రైతులను వేరుకుళ్ళ తెగుళ్ల బెడద వెంటాడుతోంది. ఉన్న పళంగా చెట్లు ఎండిపోతుండటంతో రైతులు నష్టాల్ని చవిచూస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కలిపి 2100 ఎకరాల్లో నిమ్మ పంట సాగవుతోంది. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తోటలు పెంచుతున్నారు. సాగునీటి వనరులు లేకున్నా బోరు బావుల ద్వారా వచ్చే అరకొర నీళ్లు, వేళ కాని వేళల్లో సరఫరా చేసే విద్యుత్‌తో పంటలు సాగు చేస్తున్నారు. ఐదేళ్ల పాటు చెట్లు బాగున్నా ఫలసాయం అందే సమయంలో వేరుకుళ్లు సోకి నిలువునా ఎండుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం కానరావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగులు విస్తరిస్తుండటంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తెగుళ్లపై అవగాహన కల్పించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. యర్రగొండపాలెం మండలం, సాయిబాబా నగర్‌కు చెందిన నిమ్మ రైతు బొల్లనేని నర్సయ్య మాట్లాడుతూ రెండెకరాల్లో 180 నిమ్మ చెట్లు సాగు చేశానన్నారు. ఏడాదికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టానని, ఆరేళ్ల పాటు మందులు, ఎరువులు వేశానని చెప్పారు. పంట కోత దశలో ఉండగా చెట్లు తెల్లగా మారుతున్నాయన్నారు. తెగులు సోకి 30 చెట్లకు పైగా చనిపోయాయన్నారు. మందులు పిచికారీ చేసినా ఫలితం దక్కలేదని పేర్కొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే తెగులు నివారణ

పల్లకి ఆదిరెడ్డి, ఉద్యాన శాఖాధికారి, యర్రగొండపాలెం

చెట్లకు వేరుకుళ్లు వ్యాధి సోకినప్పుడు రైతులు గమనించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. చెట్టుకు బాగా నీళ్లు పట్టాక, రెండు రోజులు కార్బండిజమ్ రెండు గ్రాములను లీటరు నీటిలో కలిపి చెట్ల పాదులో పోయాలి. వాతావరణ మార్పులతో తెగులు సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా భూమి సారవంతంగా మారేందుకు పచ్చిరొట్ట, సేంద్రీయ ఎరువులు, వర్మీ కంపోస్టును ఎక్కువగా వాడాలి.



కనిగిరి ఇన్‌ఛార్జిగా 'దద్దాల'

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థిగా పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గురువారం నాడు సిఎం జగన్‌ను కలిశారు. అందరినీ కలుపుకొని పోవాలని సూచించారు. మార్కాపురంలోనే పోటీకి సిఎం జగన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇక గిద్దలూరులో ఎవరన్నది చూడాలి. బాలినేని జాబితాలో ఉన్న రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డికి అవకాశం ఉంటుందా? అనేదీ చూడాలి. కనిగిరి విషయానికి వస్తే ఇక్కడ సిట్టింగు బుర్రా మధుసూదన్‌పై పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ఆయన్ను కూడా మార్చాలనే యోచనలో సిఎం జగన్ స్పష్టంగా ఉన్నారు. బుర్రాను తప్పించి మరో బీసీకి అవకాశం ఇద్దామని సిఎం జగన్ ఆలోచిస్తున్నారు. ఇదే విషయాన్ని బాలినేనికి కూడా చెప్పడంతో మీ ఇష్టమని చెప్పి వచ్చారు. ఈ నేపథ్యంలో హనుమంతునిపాడు జడ్పీటిసి దద్దాల నారాయణ తాడేపల్లిలో సిఎం జగన్‌ను గురువారం కలిశారు. గురువారం సాయంత్రమే నాలుగో జాబితాలో జిల్లా నుంచి దద్దాలను కనిగిరి ఇన్‌ఛార్జిగా ఖరారు చేశారు. మిగతా అభ్యర్థుల ఎంపిక తుదిదశకు చేరుకుంటోంది. అసెంబ్లీ స్థానాలపై కసరత్తు తుదిదశకు చేరినా ఒంగోలు ఎంపీ అభ్యర్థి విషయం పార్టీలో గుంభనంగా ఉంది. ఎవరన్న దానిపై ఇంకా అధిష్టానం ఓ నిర్ణయానికి రాలేదు.

విద్యుత్‌షాక్‌తో నాయనమ్మ, మనవరాలు మృతి

(మొదటిపేజీ తరువాయి)

తృటిలో ఆమె తప్పించుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈపురుపాలెం ఎస్సై జనార్థన్ కేసు దర్యాప్తు చేపట్టారు. పొలానికి వేసిన కంచెకు భూ యజమాని కరెంటు పెట్టాడా లేక? ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు కంచెకు తగిలాయా? అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

పంటలు కాపాడుకునేందుకు అవస్థలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

వర్షాలు లేవు.. చెరువుల్లో నీరు కరువైంది.. వేసిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర కసరత్తులు మొదలుపెట్టారు. వరి పొలాల్లో బోర్లు వేసి మరీ నీరు తెప్పించే ప్రయత్నంలో రైతన్నలు నిమగ్నమయ్యారు. పాకల గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులో నీరు తగ్గిపోవడంతో ఇప్పటికే రైతులు వరి పంట వేయని పరిస్థితి అక్కడ ఉంది. వర్షాలపై నమ్మకంతో ఎవరి పొలాల్లో వాళ్ళు వరి నారుమల్లు వేసి ఇప్పటికే నష్టపోయారు. వేసిన వరి నారు మడులు ఎండిపోయి నష్టపోయిన రైతులు. వాటిని వధాగా పోనివ్వకుండా బర్రెలకు మేతగా నారుమడులు వాడుకుంటున్న పరిస్థితి ఈ గ్రామంలో కనిపిస్తుంది. నారుమడుల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులు వాటిని ఇలా మేతగా వినియోగించుకుంటున్నారు. అయితే కొంతమంది రైతులు ధైర్యం చేసి ముందుకు వెళ్లారు. ఎలాగైనా వర్షాలు వస్తాయి పంటలు పండించుకుందాం అన్న ఉద్దేశంతో ప్రకాష్ రెడ్డి అనే రైతు నాలుగు ఎకరాల వరిని వేశారు. అయితే నీరు లేక వరి ఎండి పోతున్న సమయంలో వరి పంటను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు కష్టపడి నాలుగు ఎకరాల పొలంలో ఒక్క బోరుకు 20వేల రూపాయలు చొప్పున నాలుగు బోర్లు నాలుగు ఎకరాల్లో వేయించాడు. అయితే 80 వేల రూపాయలు ఖర్చు అయినప్పటికీ బోర్లు ఫెయిల్ అవడంవల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆయన అంటున్నారు. వర్షాలు వస్తాయని ఎంతో ఆశతో వరి నారువేసి వరి పొలంలో పంట వేస్తే అది చేతికి వస్తుందో రాదో పరిస్థితిగా మారింది అన్నారు. ఇప్పటికి నాలుగు ఎకరాలకు లక్ష రూపాయల పైగా ఖర్చు పెట్టినట్లు తెలిపారు. ఈ సంవత్సరం తీవ్ర ఇబ్బందులేనని ఆయన వివరించారు.

వరి చేలో బోర్లు వేసిన దృశ్యం

పొగాకు రైతుల నీటి కష్టాలు

• 5కిలోమీటర్ల నుండి నీరు తోలకం • అడుగంటుతున్న పాలేరు నీరు • ఆందోళనలో పొగాకు రైతులు

ప్రజాశక్తి - పిసి పల్లి

పొగాకు రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంత ఇబ్బందులు ఈ ఏడాది పొగాకు రైతులకు ఎదురయ్యాయి. మండలంలోని పెదఅలవలపాడు, రేగడ, వెంగళాపురం, పోతవరం, రామాపురం, చౌటగోగులపల్లి, గుదెవారిపాలెం, బండపాలెం గ్రామాల్లో రైతులు ప్రధానంగా రైతులు పొగాకు సాగు చేశారు. ఆయా గ్రామాల భూములకు పాలేటి నీళ్లే ప్రధాన ఆదారం. వీటికితోడు పొన్నలూరు మండలం నుండి మరికొందరు రైతులు మారేళ్ళ, రామగోవిందాపురం, వరిమడుగు, దివాకపురం గ్రామాల్లో భూమిని కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేస్తుంటారు. పాలేరునది పరివాహక ప్రాంతంలో సాగు చేసే రైతులకు పాలేరులో నీళ్ల లేకపోవడంతో ఈ ఏడాది తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. సకాలంలో వర్షాలు లేకపోవడం, భూగర్భ జాలాలు అడుగంటడంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఐటిసి వారు కూడా పొగ మొక్కకు సరిపడ్డ నీళ్ళు లేవని గుర్తించారు. అనేక చోట్ల నీరు సరిపోక మొక్క గిడస

ట్రాక్టర్‌తో నీటిని తరలిస్తున్న ట్యాంకర్

బారిపోవడం, ఆకులు ఎర్రపడిపోయాయి. వీటిని గుర్తించి ఐటిసి వారు మూడు కంపెనీలతోపాటు మరో రెండు రకాల మందులను పిచికారి చేయాలని సలహా ఇచ్చారు. మూడెకరాలకు 400 లీటర్లు పిచికారి చేయాలని సలహాలు ఇచ్చారు. మందులను పిచికారి చేసేందుకు కూడా నీరు లేదు. నవంబర్ నెలలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు, చెక్‌డ్యాముల వద్దకు వెళ్ళి ట్రాక్టర్లలోని డ్రమ్ములు నింపుకుంటున్నారు.

ట్యాంకర్లతో నీటిని తోలుకుంటున్నా

చెన్నపాటి వెంకటరావు, పెదఅలవలపాడు

నాకున్న బ్యారెన్‌కు 20ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశాను. నవంబర్‌లో కురిసిన వర్షాలకు ఆలస్యంగా మొక్కలు నాటాము. నెల రోజులు కూడా నీరు సక్రమంగా అందలేదు. ఐటిసి వారి సలహా మేరకు మందులను పిచికారి చేసేందుకు ట్యాంకర్లు, డ్రమ్ముల ద్వారా నీళ్ల తెచ్చి పిచికారి చేస్తున్నాము. ఇప్పటి వరకు పాలేరు నదిలోని నీటిని ట్రాక్టర్లు, డ్రమ్ముల ద్వారా 5కిలో మీటర్ల దూరంలో ఉన్న పొలాలనికి తీసుకెళ్ళి మందుల పిచికారి చేస్తున్నాము. పైరు పెరుగుతుందన్న ఆశ కూడా లేదు. వారం, పది రోజుల్లో వర్షాలు రాకపోతే పాలేరులో నీరు అడుగంటిపోతుంది. ఈ ఏడాది పొగ నారు పోసి కొంత నష్టపోయాను. ఇప్పుడు పొగాకు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని ప్రజాశక్తికి వివరించారు.

'పశ్చిమం'లో ఆగని వలసలు

పనులు వెతుక్కుంటూ పట్టణాలకు • ఊళ్లు వీడుతున్న చిన్న, సన్న కారు రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వర్షాభావం రైతుల పాలిట శాపంగా మారింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, ఆముదం, మిర్చి, కంది, మినుము తదితర పంటలు వర్షాభావంతో దెబ్బతినడంతో దిగుబడిపై అన్నదాతలులు వదులుకున్నారు. సాగు చేపట్టేందుకు చేసిన అప్పులు గుదిబండగా మారాయి. వాటిని తీర్చేందుకు మరో మార్గంలేని పరిస్థితుల్లో రైతులు ఊళ్లు వదులుతున్నారు. చంటి బిడ్డలతో సహా మూట ముల్లె సర్ధుకొని వలసబాట పడుతున్నారు.

వలసలు వెళ్తున్న కూలీలు

నియోజకవర్గంలో వలసలు ఇలా..

ముఖ్యంగా యర్రగొండపాలెం నియోజరవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో కలిపి ప్రతియేటా 25 వేల మంది దాకా వలసబాట పడుతుంటారు. అయితే ఈ ఏడాది ఇప్పటికే సుమారు 30 వేల మంది దాకా వలసబాట పట్టారు. ఉళ్లో ఉపాది లేక వలనే బాట పట్టామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు బాగా పండి దిగుబడి వస్తే అక్కడే పనులు ఉండేవని, చిన్న సన్నకారు రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు ఉపాది దొరికేదని పంటలు ఎండిపోవటంతో పైర్లను దున్నేసి మూగజీవాలకు మేతగా పదిలేసి వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. రెండు నెలల పాటైనా వలన వెళ్లిన చోట పనులు దొరికితే కొంత మేర కుటుంబ ఖర్చులకైనా వస్తాయని, మరికొంత అప్పులు చెల్లించవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా తెలంగాణ, మద్రాసు, పల్నాడు, బెంగుళూరు ప్రాంతాలకు మట్టి పనులు, చెరువు కోత, వ్యవసాయ పనులు, తాపీ పనులు తదితర పనులు వెతుక్కుంటూ సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. చంటి పిల్లలను సైతం వెంట తీసుకెళ్తున్నారు. తిరిగి వర్షాకాలం వచ్చి వ్యవసాయ పనులు ప్రారంభమై పనులు దొరికే దాకా దూర ప్రాంతాలలో పనులు చూసుకుంటూ జీవనం గడుపుకుంటామని వలసబాట పట్టిన పలువురు పేర్కొన్నారు. తాము ప్రతియేటా ఏడాదిలో ఎనిమిది నెలలు పాటు వలసతోనే జీవనం గడపాల్సి వస్తుందని చెప్పారు. ఈ ఏడాది వరి పంట సరిగ్గా పండక పనులు కూడా దొరకలేదన్నారు. అందుకే దూర ప్రాంతాలకు వలసబాట పట్టినట్లు చెప్పారు.

ఎండుతున్న పంటలు

జినుకూటి రాజీవ్ గాంధీ, నాయుడుపాలెం

20 ఏళ్లలో ఇంతటి కరువు పరిస్థితులు ఎప్పుడూ చూడ లేదు. పంట వేసినప్పటి నుంచి ఇంత వరకు వర్షం రాక పూర్తి స్థాయిలో ఎండిపోయిన విచిత్ర పరిస్థితి. ఇంతటి కరువు పరిస్థితులు ఉన్నా కనీసం ప్రభుత్వం గుర్తించి కరువు మండలంగా ప్రటించకపోవటం విచారకరం. కరవు మండలంగా ప్రకటించకపోవడంతో వచ్చే పంటల బీమా, పంట నష్ట పరిహారం వచ్చే పరిస్థితి కనిపించటం లేదు.

పిల్లా పాపలతో వెళ్తున్నాం

ముటుకూరి వెంకట సుబ్బయ్య, నాయుడుపాలెం

పంట సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులకూ దక్కకపోవటంతో గ్రామంలో ఉండి ఏం ప్రయోజనం. కుటుంబం గడవని పరిస్థితి. పిల్లలతో కలిసి కుటుంబమంతా వలస బాట పట్టాల్సి వస్తోంది. రాబోయే రోజుల్లో మండలంలోని చాలా గ్రామాలు ఇదే బాట పట్టక తప్పేలా లేదు. ప్రభుత్వం రైతులను, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి.

ఉపాధి పనులు కల్పించాలి

బొజ్జా వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు, పుల్లలచెరువు

జనవరి నెల వచ్చినా ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఉపాధి పనులు ప్రారంభం కాలేదు. ఇటు వ్యవసాయ పనులు లేక, అటు ఉపాధి పనులు లేక జీవనం భారంగా మారింది. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది కూలీలు సన్న, చిన్నకారు రైతులు వలసబాట పడుతున్నారు. ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలి.

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. No. 52/2023
గొట్టిముక్కల ఐశ్వర్య @ గంగుల ఐశ్వర్య ..పిటిషనర్
వర్సెస్
గంగుల వెంకటేశ్వర్లు ... రెస్పాండెంట్
To: రెస్పాండెంట్ : గంగుల వెంకటేశ్వర్లు, **30 Years, S/o.** అంజయ్య, వ్యాపారం, **R/o. D/o.**1-91, **S.C.** కాలని, వెంపాడు గ్రామం, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లో మీరు పిటిషనర్ భర్తగారైయున్నారు. పిటిషనర్ మీ యొక్క వివాహం రద్దు కొరకు పై నెంబరు పిటిషటషన్ ను మీపై దాఖలు చేయగా, రెస్పాంటెంట్ అయిన మీరు పిటిషన్ నోటీసులు ఎన్నిసార్లు పంపినను మీరు తీసుకొనక తిప్పి పంపుట వలన శ్రీ కోర్టు వారు పై పిటిషన్‌ను మీ హాజరు నిమిత్తం తే.**01-02-2024** ది నకు వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు స్వయంగా గాని, లాయర్ ద్వారా గాని పై కోర్టులో ఉదయం గం.10-30 ని॥లకు హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు పై పిటీషనలో తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 01-02-2024
స్థలం: దరిశి
తేది: 18-01-2024
ఇట్లు
గువ్వల శ్రీనివాసులరెడ్డి
అడ్వకేట్, దరిశి, ప్రకాశం జిల్లా.

సి.పి.సి. ఆర్డర్ 5 రూల్ 1 ప్రకారం నోటీసు
కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.P.No. 40 / 2016
కేశినేని నాగేశ్వర రావు - పిటిషనరు
Vs
రావి శింగయ్య, వగైరా - రెస్పాండెంట్లు
టు,
వల్లూరి జయరామ్, తండ్రి **కొండయ్య** (R4) నాగిరెడ్డిపాలెం గ్రామం & పోస్టు, పొన్నలూరు మండలం, ప్రకాశం జిల్లా. (A.P.)
పై నెంబరు ఋణగ్రస్తుడు ఇ.పి.లో పిటీషనరు42 మంది రెస్పాండెఎంట్లుపైన ఋణగ్రస్తుడు ఇ.పి. పై కోర్టులో దాఖలు చేయగా శ్రీ కోర్టు నీకు అనగా 4వ రెస్పాండెంటు అయిన నీకు సదరు కేసు నోటీసు జారీ నిమిత్తం **తే13-02-2024**దికి వాయిదా వేయబడినది. కావున పై తెలిపిన తేదీన అనగా **తే13-02-2024**దికి **ఉదయం 10.30 నిముషములకు** నీవు స్వయంగా గానీ, నీ ప్లీడరు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల పై కేసు నీ పరోక్షంగా తీర్మానించగలరు.
//పై కోర్టువారి ఉత్తర్వుల మేరకు//
కె.వి. లక్ష్మీనారాయణ
పిటిషనరు తరపు అడ్వకేటు, కందుకూరు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి
'గోరంట్ల' భరోసా

ప్రజాశక్తి-తాళ్లూరు

ఆర్థిక సాయం అందజేస్తున్న గోరంట్ల

తాళ్లూరు మండలం, తూర్పు గంగవరానికి చెందిన టిడిపి కార్యకర్త చాట్ల బాలయ్య ఇటీవల ప్రమాదానికి గురై కాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న దర్శి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు గోరంట్ల రవికుమార్ బాలయ్య కుటుంబానికి అండగా నిలిచారు. బాలయ్య కుమార్తె గోరంట్ల రవికుమార్‌కు చెందిన శ్రీ హర్షిణి కళాశాలలో డిగ్రీ చదువుతుండగా మూడేళ్లు ఉచితంగా డిగ్రీ విద్యను అందిస్తానని హామీ ఇచ్చారు. అంతేగాక డిగ్రీ అయిపోయిన వెంటనే బాలయ్య కుమార్తెకు ఉద్యోగ భరోసా కూడా కల్పిస్తాననడంతో చాట్ల బాలయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ ఖర్చుల కోసం బాలయ్యకు 40 వేల రూపాయల ఆర్థిక సహకారం అందించారు. టిడిపి కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని గోరంట్ల హామీ ఇచ్చారు.

'ఆలూరి' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుందర్‌రావు

ఆలూరి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో త్రోవగుంటలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో 252 మంది పేషెంట్స్‌కు ఉచితంగా పరీక్షలతోపాటు మందుల్ని అందజేసినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మూర్తి సాతులూరి తెలియజేశారు. ప్రముఖ సీనియర్ జనరల్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్‌రావు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అనుసూర్య, ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ ఏవి సుందర్‌రావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సాయిగణేష్ వైద్యసేవలందించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ క్యాంపును నాగ సత్యలత ప్రారంభించారు. ఈ క్యాంపు నందు ఉచితంగా ప్రివిలైజ్డ్ కార్డులను డిస్ట్రిబ్యూట్ చేశామని, ఈ కార్డు ద్వారా ఒక సంవత్సరం పాటు ఎవరైతే కార్డు వినియోగదారులు ఉంటారో వారికి, వారి కుటుంబ సభ్యులకు ఉచిత ఓపిని దాంతో పాటుగా 20 శాతం లాబొరేటరీ పరీక్షలపై రాయితీని ఇస్తామని సంస్థ డైరెక్టర్ డాక్టర్ రమా తెలిపారు. ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ అయినచో 15 శాతం డిస్కౌంట్‌ను ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎర్రమనేని వేణుగోపాల్, గోపికష్ణ, శ్రీనివాస్, వెంకట్రావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఘనంగా నాటకోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

యన్.టి.ఆర్ కల్చరల్ అసోసియేషన్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో స్థానిక సి.వి.యన్ రీడింగ్ రూం ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన నాటకోత్సవ వేడుకలు గురువారం సాయంత్రం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ కంచర్ల రామయ్య జ్యోతి ప్రజ్వలన చేసి.. ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నందమూరి తారకరామారావు సంస్మరణ సభను పురస్కరించుకుని ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు సిహెచ్ రజితమూర్తి దంపతుల్ని యన్‌టి.ఆర్ అవార్డుతో సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు సూదనగుంట వెంకటేశ్వర్లు మాట్లాడారు. శుక్రవారం కూడా నాటికల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. తులసి, అచ్యుత్ ఆధ్వర్యంలో మధుర గీతాలాపన జరిగింది. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, యస్. కోటేశ్వరరావు, కఠారి నాగేశ్వరరావు పాల్గొన్నారు కార్యక్రమానికి కళామిత్రమండలి అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కె.బాలకోటయ్య పర్యవేక్షణా సహకారం అందించారు.

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

సొంతింటి కోసం ఆర్థిక చేయూత

లబ్ధిదారులకు చెక్కు అందజేత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలందరికీ సొంత ఇంటి స్థలం, గహ నిర్మాణాలకు ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ తిరిగి చెల్లించే కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత చేతులమీదుగా జిల్లాలోని లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంతో నిరుపేదలకు సొంతింటి కల సాకారమవుతుందని కలెక్టర్ చెప్పారు. పేదలు తమ సొంత ఇంటిలో సంతోషంగా ఉన్నారని తెలిపారు. నిరుపేదలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని వివరించారు. వారి సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే నగదుతో పాటు స్వయం సహాయక సంఘాలలోని సభ్యులుగా ఉన్న మహిళలందరికీ ప్రభుత్వం అదనపు రుణాలు పంపిణీ చేసిందన్నారు. ఆ రుణాలకైన వడ్డీ సొమ్మును లబ్ధిదారులకు భారం కారాదని ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుందన్నారు. లంచాలు, అక్రమాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు అందుతుందన్నారు. జిల్లాలో 10,592 మంది లబ్ధిదారులకు రూ 1.42 కోట్లను లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ సిహెచ్ కృష్ణ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బాపట్ల అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో సామాజిక న్యాయ మహా శిల్పం ఏర్పాటు సందర్భంగా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం పుస్తకంలాంటిదన్నారు. చిన్నతనం నుండి అంటరానితనంపై పోరాటం చేశారన్నారు. అంబేద్కర్ సమస్యలపై ప్రశ్నించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. అంబేద్కర్ పది మందికీ తన జీవితం ఉపయోగపడే విధంగా చేశారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం అందరికీ ప్రేరణగా నిలిచిందన్నారు. ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మహా కార్యక్రమానికి శుక్రవారం జిల్లా నుండి పది వేల మంది ప్రజలు హాజరుకావాలని కోరారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి ప్రజలందరూ హాజరు కావాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, జాయింట్ కలెక్టర్ శ్రీధర్, దళిత సంఘాల నాయకులు చారువాహక, చుక్కా నాగభూషణం, అబ్రహం లింకన్, టి.అశోక్, నూకతోటి బాబురావు, ఐ.మాల్యాద్రి, జి రాజారావు, డి.రాము, కాంతారావు, పల్నాడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపే ఎన్టీఆర్‌కు నివాళి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యుగ పురుషునిగా పేదల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని, రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పిలుపునిచ్చారు. టిడిపి ఒంగోలు నియోజకవర్గం ఆధ్వర్యంలో కీర్తిశేషులు ఎన్టీ రామారావు 28వ వర్ధంతి వేడుకలు ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఒంగోలు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వర్ధంతి వేడుకలలో జనసేన ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌తో కలిసి దామచర్ల పాల్గొన్నారు. ముందుగా ఒంగోలు నగరంలోని 37వ డివిజన్‌లోని చెన్నకేశవ స్వామి లే అవుట్‌లో గల ఎన్టీఆర్ పార్కు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన వర్ధంతి సభలో ముందుగా దామచర్ల, షేక్ రియాజ్‌లు కలిసి ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో దామచర్ల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలని సూచించారు. టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు, ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. ఎన్టీఆర్ ఆశయాలతో ముందుకెళ్లాలని సూచించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడి

ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న దామచర్ల జనార్ధన్

ప్రభుత్వ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, మాజీ శాసన సభ్యులు బిఎన్ విజయ్ కుమార్, గోరంట్ల రవికుమార్, పార్టీ పరిశీలకులు వినకొండ సుబ్రహ్మణ్యం, మంత్రి శ్రీనివాసరావు, వైవి సుబ్బారావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, రావుల పద్మ, పగిడి రాములు, పగిడి సాంబ, బెజవాడ మురళీకష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు భారీగా పాల్గొన్నారు.

39వ డివిజన్‌లో..

ఒంగోలు నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న 39 వ డివిజన్‌లోని శ్రీ కష్ణనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహనికి బెజవాడ మురళీకష్ణ పూలమాలలు వేసి.. నివాళులర్పించారు.

ఆత్మహత్యకు యత్నించిన
మహిళను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఆత్మహత్యకు యత్నించిన మహిళను బాపట్ల పోలీసులు కాపాడారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల పట్టణం ఉప్పరపాలెం లో నివాసముండే మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, ఆ బాధలను భరించలేక చనిపోవాలనే ఉద్దేశంతో జనవరి గురువారం ఉదయం సూర్యలంక సముద్రపు తీరం నందు ఆత్మహత్యకు యత్నించినది. గస్తీ విధులలో ఉన్న సూర్యలంక అవుట్ పోస్ట్, మెరైన్ పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి, అప్రమత్తంగా వ్యవహరించి ఆమె ప్రాణాలను కాపాడినారు. అనంతరం ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి బంధువులను పిలిపించి వారికి అప్పగించారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అంకమ్మరావు గురువారం తెలిపారు. అతని వద్ద నుంచి 44 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పిసిపల్లి: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన పూజల వెంకట నారాయణ కనిగిరి నుంచి మద్యం తీసుకొని వచ్చి అమ్ముతున్నాడన్న ఆరోపణపై అతడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న 180 ఎంఎల్ 8 మద్యం బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి కోటయ్య గురువారం తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించండి

ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వరకుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

నియోజకవర్గంలోని నాల్గు మండలాలలో పోలింగ్ కేంద్రాలను ఆయా సెక్టోరియల్ అధికారులు పరిశీలించి, తగిన కనీస సౌకర్యాలు కల్పించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వరకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ మీటింగ్ హాలులో నాల్గు మండలాల తహశీల్దార్లు, సెలక్ట్రోరల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబంధిత అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు, గతంలో ఏవైనా గొడవలు జరిగాయా.? పోలింగ్‌స్టేషన్ల పూర్వ చరిత్ర తదితర అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు పిన్నిక మధుసూదనరావు, ఆశా జ్యోతి, సృజనకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిపి ముస్లిం యూత్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాల వారికి బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 20 కుటుంబాల వారికి అందజేశారు. ఈ సంధర్భంగా ముస్లీం యూత్ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రుల ఆరాధ్యదైవ కార్యక్రమంలో టిడిపి ముస్లిం యూత్ నాయకులు ఎస్‌కె మోమిన్, ఎస్‌కె.అమానుల్లా, సయ్యద్ రఫీ, బాజీ, మునీర్, ఇద్దు, మీరావలి, గౌస్‌మొహిద్దీన్, షరీఫ్ పాల్గొన్నారు.

టిడిపిలోకి 30 కుటుంబాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన 30 కుటుంబాలకు చెందిన వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ సమక్షంలో చేరారు. ఈ సంధర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపిలోకి వలసల వరద కొనసాగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అత్యధిక స్థానాలు సాధించి అధికారలోకి రావడం ఖాయమన్నారు. టిడిపిలోకి వచ్చిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, గొల్లపూడి సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, ఆర్ రాంబాబు, సూరంపల్లి హనుమంతరావు, ఉన్నం సుబ్బారావు పాల్గొన్నారు.

బాపట్లలో న్యాయవాదుల నిరసన దీక్షలు

భూ యాజమాన్య చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య హక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు భీమా లీలా కృష్ణ అన్నారు. ఈ చట్టం రద్దు చేయాలని కోరుతూ స్థానిక పాత బస్టాండు లో జరుగుతున్న న్యాయవాదుల నిరాహార దీక్ష శిబిరంకు ఆయన మద్దతు తెలిపారు. ఇది న్యాయవాదులు తమ కోసం చేసే సమ్మె కాదన్నారు. రాష్ట్రంలో భూ యజమానులు, రైతుల భవన యజమానులు, ఇళ్ల స్థలాల యజమానులు, భూమి కలిగిన వారందరి సమస్య అన్నారు. హక్కు దారుని భూమిపై సమస్య వస్తే వారి హక్కు నిర్ధారించుటకు సివిల్ కోర్టులో దావావేసే హక్కును ఈ చట్టం హరిస్తుందని అన్నారు. శిబిరంలో న్యాయవాదులు బిల్లా కమలా కుమార్, బిల్లా స్టాన్లీ విమల్ కుమార్, కర్రీ శివ రామ కృష్ణ, అగిసెట్టి విజయ్ మాధురి, యాతం సతీష్ రాజా పాల్గొన్నారు.

వెంకట్రామయ్య చిత్రపటానికి సిపిఎం నేతల నివాళి

వెంకటరామయ్యకు నివాళి

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలం ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన మాజీ మండల సర్వేయర్, సిపిఎం నాయకులు తిరుమల శెట్టి వెంకటరామయ్య 4వ వర్ధంతిని గాజుల్లంక గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం నాయకులు అమర్తులూరి కృపానం దం, సనకా అగ్గి రామయ్య గాజులంక గ్రామంలో గల అమరవీరుల స్థూపం వద్ద వెంకట్రామయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం కార్యదర్శి తోడేటి సురేష్ మాట్లాడుతూ వెంకట్రామయ్య ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూనే నిరంతరం పోరాడే వారని, పదవి విరమణ అనంతరం ఎర్ర జెండా పట్టుకుని ప్రభుత్వ భూములు గుర్తించి ఆనాటి శాసనసభ్యులు గుదిబండ వెంకటరెడ్డితో లంక గ్రామ రైతాగానికి లంక భూముల సాధన కమిటీ పేరుతో అనేక ఆందోళనలు చేపట్టారని పేర్కొన్నారు. అప్పటి ఆందోళన ఫలితమే నేడు లంక భూములు రైతాంగానికి దక్కాయని అన్నారు. ఆయన తుది శ్వాస విడిచే వరకు పార్టీకి కట్టుబడి పని చేశారని, ప్రజాశక్తి దినపత్రిక విలేకరిగా పనిచేసి అనేకమంది మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అరవ వీరభద్రుడు, సనకా కుమారస్వామి, అరవ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ చిత్రపటానికి మునగపాటి నివాళి

మునగపాటి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - వేటపాలెం

చంద్రబాబును సిఎం చేసుకుంటేనే మళ్లీ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని టిడిపి సీనియర్ నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని నూలుమిల్లు సెంటర్ నందు ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా రెండు వేల మందికి అన్నదానం చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. రానున్న ఎన్నికల్లో తాను టిడిపి తరపున బరిలో దిగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సజ్జ వెంకటేశ్వరరావు, డాక్టర్ సజ్జ హేమలత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం దుర్మార్గం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య

అంగన్‌వాడీల ధర్నాలో సిఐటియు నేత గంగయ్య

రేపల్లెలో అంగన్‌వాడీల పొర్లు దండాలు

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న నిరసన సమ్మెలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విజ్ఞతతో వ్యవహరించి అంగన్‌వాడిల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అక్క, చెల్లెమ్మలంటూ సంభోదించే సిఎం జగన్మోహన్ రెడ్డి మహిళల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఐక్యంగా ఉండి వేతనాల సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ బాబురావు, ఎం వసంతరావు, ప్రమీల, సుజీవన, సులోచన పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం మొండి, నిర్లక్ష్య వైఖరితో ఉందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెనుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు మాట్లాడారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ స్థానిక నాయకులతో కలిసి అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఎస్మాతో దారికి రాకపోవడంతో పెంచిన వేతనాలు జులై నుంచి ఇస్తామంటూ కొత్త పల్లవి అందుకున్నారని అన్నారు. ఏప్రిల్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జులై నుంచి వేతనాలు ఎవరు ఇస్తారని ప్రశ్నించారు.

నిజంపట్నం : అంగన్‌వాడిల సమస్యలు పట్ల ప్రభుత్వం మొండివైఖరి మానుకుని సమస్యలు పరిష్కారంచేయాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఉషారాణి కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో నిరసన కొనసాగించారు. రాష్ట్రకేంద్రంలో అంగన్‌వాడి కార్యకర్తలు నిరవదిక నిరాహారదీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వారి ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా జీతాల పెంపుధలపై స్పష్టమైన ప్రకటన ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉందని అన్నారు. బెదిరింపు ధోరణి మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, గాయత్రి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : అంగన్‌వాడి కార్యకర్తలు 38వ రోజు దీక్షలను కొనసాగించారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తూ, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తుందని, రాజధానిలో నిరాహార దీక్ష చేస్తున్న కార్యకర్తల ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ప్రభుత్వం బెదిరింపు ధోరణికి పాల్పడుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మనిలాల్ అన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం అవుతుందని అన్నారు. బెదిరింపు ధోరణితో ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ 38రోజులుగా సమ్మె చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు కె ఝాన్సి అన్నారు. తహశీల్దారు కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి చర్చించారు. అంగన్‌వాడిల వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నోటీసులు, ఎస్మా ప్రయోగాలు చేపట్టటం దారుణమని అన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు.

రేపల్లె : అంగన్‌వాడిల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ 38వ రోజు సమ్మె కొనసాగించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె ఝాన్సీ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పండగలకు కూడా రోడ్డు మీద ఉండి ఆందోళన చేయాల్సి వస్తుందని అన్నారు. మొండి వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎన్ కృష్ణకుమారి, వై మేరీమణి, నిర్మలజ్యోతి, డి జ్యోతి, శివలక్ష్మి, రజిని పాల్గొన్నారు.

కొల్లూరు : అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో 38వ రోజు సమ్మె కొనసాగించారు. గ్రేస్ ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ నాయకులు కైతేపల్లి షాలేం రాజు మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడి యూనియన్ అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా తమను రోడ్లపై కూర్చో బెట్టాడని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి సుబ్బారావు, అంగన్‌వాడి లీడర్స్, కాంగ్రెస్ నాయకులు కూడేటి నగేష్, చుండూరు జాషువా, గరికిపూడి జగ్గారావు, సురేష్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : అంగన్‌వాడి కార్యకర్తల సమ్మె 38వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చేస్తుందని, ఎస్మా ప్రయోగించి, షోకాస్ నోటీసులు ఇచ్చినప్పటికి కార్యకర్తలు నోటీసులకు సమాధానం ఇచ్చారని సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు అన్నారు. తాజాగా సిడిపిఓ ఆఫీస్ నుండి టెర్మినేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని, జీతాలు పెంచకుండా సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు నినదించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్లు బిక్కీ సరళ, అనురాధ, సుజాత, కస్తూరి, దేవమణి, రాణి, సంధ్య, పరం గీతం పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు, ఎం డేవిడ్, బి చిన్నదాసు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో అంగన్‌వాడీల నిరసన ధర్నా

కొల్లూరులో అంగన్‌వాడీలకు కాంగ్రెస్ మద్దతు

మార్టూరులో అంగన్‌వాడీలకు టిడిపి మద్దతు

గ్రేస్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేమూరు


ఆర్థిక సహాయం అందజేస్తున్న షాలెంరాజు

కొల్లూరు గ్రామానికి చెందిన పులివర్తి అంకనీడు ప్రసాద్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. వ్యవసాయ కూలిగా ఉన్న అంకిరెడ్డి ప్రసాద్ కుటుంబం ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని గ్రేస్ ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ నాయకులు కైతేపల్లి షాలెంరాజు తన వంతు సహాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. షాలెం రాజు కాంగ్రెస్‌లో చేరినప్పటి నుండి తన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేసినట్లు తెలిపారు. కొల్లూరులో జరుగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇంచార్జి కొండేటి నగేష్, చుండూరు జాషువా, ఫౌండేషన్ సభ్యులు కామేశ్వరరావు, వాసు, పరిశుద్ధరావు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిరావాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలు తరలి రావాలని ఎంపీపీ డివి లలిత కుమారి కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విజయవాడలో చేపట్టిన అంబేద్కర్ స్మృతి వనం ప్రపంచ స్థాయిలో వెలుగొందే విధంగా ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. అధ్యయన, పర్యాటక కేంద్రంగా అంబేద్కర్ స్మృతివనం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పాలిటెక్నిక్ మూడో సంవత్సరం విద్యార్థులకు వాలియో ఫ్రిక్షన్ మెటిరియల్ ఇండియా ప్రాంగణ ఎంపికల్లో 22మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాం డెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ప్రాంగణ ఎంపికలు గురువారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. 2024 విద్యా సంవత్సరంలో ఇసిఇ, ఇఇఇ, మెకానిక్ బ్రాంచిల్లో డిప్లమో పూర్తి కాబోతున్న కళాశాలకు చెందిన విద్యార్థులు 79మంది పాల్గొన్నట్లు పాలిటెక్నిక్ డెప్యూటి డైరక్టర్ కె విజయ భాస్కరరెడ్డి తెలిపారు. వాలియో ఫ్రిక్షన్ మెటీరియల్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ ప్రతినిధులు మాట్లాడుతూ 1997లో ఆనంద్ గ్రూప్, వాలియో గ్రూప్ సంయుక్తంగా తమిళానాడులో చెంగల్పట్ నందు కంపెని స్థాపించినట్లు తెలిపారు. మన్నిక కలిగిన ఆటోమొబైల్ స్పేర్ పార్టులను తయారు చేస్తుందని తెలిపారు. కంపెనీలో లక్ష పది వేల మంది ఉద్యోగులు వివిద హెరీదాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. కంపెనీకి పూనె, సనాద్, నోయిడా, గుర్నెలో బ్రాంచిలు ఉన్నట్లు తెలిపారు. ప్రాంగణ ఎంపికలకు హజరైన విద్యార్థులకు వ్రాత పరీక్షను నిర్వహించగా 35మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా వారిలో 22మంది విద్యార్థులు ప్రోడక్షన్ ట్రైని ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రు.16వేలతోపాటు స్టైఫండ్, ఉచిత భోజనం, రవాణా సౌకర్యాలు ఇస్తారని ప్రాంగణ ఎంపికల అధికారి ఎన్ పూర్ణచంద్రరావు తెలిపారు.

ప్రజాశక్తి
5
శుక్రవారం 19 జనవరి 2024

అంగన్‌వాడీల పట్ల

ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలి

కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి-మద్దిపాడు

అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి, వారి సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతి బాబు కోరారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలువ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జయంతి బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ అంగన్‌వాడీలు పట్టుదలతో సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, పల్లాపల్లి ఆంజనేయులు, ఉబ్బా ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయప్రద, ధనలక్ష్మి,అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎల్ఐసి ఏజెంట్ రాష్ట్ర నాయకుడు బాలచంద్రం విమర్శించారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న దామచర్ల సత్య

రిలేనిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలచంద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ గత 38 రోజుల నుంచి సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని, న్యాయమైన డిమాండ్ల పరిష్కరించడం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు, నేటికీ ఉద్యోగులు, కార్మికులు సమస్యల వైసిపి ప్రభుత్వం పరిష్కరించ లేదన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ మద్దతు పూర్తిగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి సుబ్బమ్మ, నాయకులు కె.ప్రశాంతి, కె.హేమీమా, సిహెచ్ జ్యోతి, సంధ్య, మహాలక్ష్మి, శ్రీదేవి, సిఐటియు నగర ఉపాధ్యక్షుడు ఎస్‌డి.హుస్సేన్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పొదిలి : అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ఎత్తివేయకుంటే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా విధించి షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ నిర్వమించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే ఎస్మా చట్టం ప్రయోగిస్తామని చెప్పడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ పొదిలి ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.శోభారాణి నాయకులు యస్.శారధ, లక్ష్మీదేవి, వెంకటమ్మ, షమీమ్, యల్లమ్మ పాల్గొన్నారు.

వెలిగండ్ల : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు వెలిగండ్ల, హెచ్‌ఎం పాడు మండలాల యుటిఎఫ్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. ఖాజా రహమతుల్లా మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యమం చాలా పట్టుదలతో సాగుతుందన్నారు. అనంతరం

ఒంగోలులో దీక్షలు ప్రారంభిస్తున్న ఎల్ఐసి ఏజెంట్ల రాష్ట్ర నాయకుడు బాలచంద్రం

అంగన్‌వాడీలు షోకాజ్ నోటీసులకు సమాధానం తెలుపుతూ లేఖలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ కాశీం, షరీఫ్, జిలాని, యుటిఎఫ్ వెలిగండ్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి టివి.సుబ్బారెడ్డి, మాల్యాద్రి, కోశాధికారి మాధవ, హెచ్‌ఎం పాడు మండల శాఖ కోశాధికారి నాగార్జున, సిఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుధారాణి, ఆదిలక్ష్మి, మహాలక్ష్మి, మహేశ్వరి, సుబ్బమ్మ, బాలకోటమ్మ పాల్గొన్నారు.

కనిగిరి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం షోకాజ్ నోటీసులకు సమాధానం తెలుపుతూ లేఖలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిసి.కేశవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా చట్టం ప్రయోగించడం, నోటీసులు జారీ చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులుసుజాత, రాజేశ్వరి, సీత, మనోరంజిత, రామసుబ్బులు, డివైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

దర్శి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తాండవ రంగారావు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి మద్దతు లభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతమ్మ, బాలమ్మ, ప్రశాంతి, ఫాతిమా, మల్లేశ్వరి, దేవిసాయి, నిర్మల, నాగమణి,

గిద్దలూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

శివకుమారి, నాగేశ్వరరావు, సందు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం కోటి సంతకాల సేకరణను ప్రారంభించారు. అంగన్‌వాడీల సమ్మెకు కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్ మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకటసుబ్బమ్మ, దుర్గాభవాని, రజని , అరుణ, రమ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం కోటి సంతకాల సేకరణను ప్రారంభించారు. అంగన్‌వాడీల సమ్మెకు కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్ మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకటసుబ్బమ్మ, దుర్గాభవాని, రజని , అరుణ, రమ పాల్గొన్నారు.

టంగుటూరు : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు, కెవిపిఎస్ నాయకులు టంగుటూరి రాము, వేశపోగు మోజెస్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి సిడిపిఒకు షోకాజ్ నోటీసులకు సమాధాన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బెల్లం శేషమ్మ, జి. సుభాషిణి, హేమలత, కష్ణవేణి, విజయ, శ్రీదేవి, కమరున్నీసా పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానాలు రాసి సిడిపిఒ పద్మావతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా

పొదిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కార్యదర్శి డికెఎం.రఫీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మల్లేశ్వరి, సుభాషిణి, నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బలు, సునీత, అరుణ, జయమ్మ, నాగరాజుకుమారి పాల్గొన్నారు.

కొండపి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య నారాయణ మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు, బత్తుల నారాయణ స్వామి, రాష్ట్ర మహిళ నాయకురాలు రావిపాటి సీతమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు బి.ప్రసన్నలక్ష్మి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీలకు లిఖిత పూర్వకంగా సమాధానాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం. రఫీ, అంగన్‌వాడీ నాయకులు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరలుఉ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అందజేత

అంగన్‌వాడీల సమ్మె దీక్షలకు టిడిపి నాయకులు మద్దతు లెఇపారు. అనంతరం మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, సుబ్బరత్నం, శేషాద్రి, నాగేంద్రబాబు, శ్రీనివాసులు, రాంబాబు, సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం.రఫీ, అంగన్‌వాడీ నాయకులు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి పాల్గొన్నారు.

దోర్నాలలో సమాధానం లేఖ అందజేస్తున్న అంగన్‌వాడీలు

కనిగిరిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మద్దిపాడులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాగీలు

మసనం వెంకట్రావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

వైసిపి అధ్యక్షుడి పదవి కోసం 'మసనం' తీవ్ర ప్రయత్నాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి శింగరాయకొండ మండల అధ్యక్షుడి పదవి కోసం ఆ పార్టీ నాయకుడు మసనం వెంకట్రావు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు. వైసిపి మండల అధ్యక్షుడిగా గతంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన తాండ్ర రామ్మూర్తి నియమితులయ్యారు. ఆయన తొలగించి అదే సామాజిక వర్గానికి తమకు వైసిపి అధ్యక్ష పదవి వస్తుందని ఆశించి అందరూ భంగపడ్డారు. వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డికి పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. గతంలో వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక బాబు ఇలా నిర్ణయం తీసుకున్నారని వైసిపి రాష్ట్ర నాయకుడు యన్నాబత్తిన వెంకటేశ్వరరావు వైసిపి రాష్ట్ర కమిటీ కూడా ఫిర్యాదు చేశాడు. శింగరాయకొండ మండలంలో యాదవ సామాజిక వర్గానికి వైసిపి అధ్యక్ష పదవి ఇవ్వాలని డిమాండ్ ఉన్న నేపథ్యంలో శింగరాయకొండ-2 ఎంపిటిసి మసనం వెంకటరత్నం భర్త వైసిపి యువ నాయకుడు మసనం వెంకటరావుకు ఆ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. యన్నాబత్తిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, విజయ్ సాయి రెడ్డి, వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మంత్రి ఆదిమూలపు ఆదిమూలపు సురేష్‌ను కలిసి మసనం వెంకటరావుకి వైసిపి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించాలని కోరారు. మసనం వెంకట్రావు ఆర్థికంగా బలం కలిగిన వ్యక్తి. శింగరాయకొండ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీకి బలం చేకూరుతుందని నేపథ్యంలో మసనం వెంకట్రావు కోసం తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదిమూలపు సురేష్ కొండపి నియోజకవర్గంలో ఏ మండలానికి వచ్చిన. ఆయనకు భారీగా స్వాగతం పలుకుతూ మసనం ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నాడు. వైసిపి మండల అధ్యక్షుడి పదవి కోసం మసనం వెంకట్రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో. వైసిపిలో చేర్పులు, మార్పులు శింగరాయకొండ మండలంలో చేపడితే అన్ని మండలాల్లో డిమాండ్ ఉంది. ఈ విషయం మంత్రి సురేష్ దష్టికి కూడా వెళ్లింది.మంత్రి సురేష్ ఆచితూసి అడుగులు వేస్తున్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి- కొత్తపట్నం

గ్రామ స్థాయి అభివద్ధి ప్రణాళికల తయారీపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్ల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కో ఆర్డినేటర్ , ఎంపిడిఒ పి. సుజాత మాట్లాడుతూ 2024 -25 కి సంబంధించి ప్రజా ప్రణాళిక ఉద్యమం, 2023-24 ద్వారా గ్రామంలోని ప్రజాప్రతినిధులు,కార్యదర్శులు, సిబ్బంది, మహిళలు గ్రామంలో పర్యటించి అభివద్ధి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి బాల చెన్నయ్య , ఎపిఎం రజియా సుల్తానా , ఎపిఒ రత్న జోత్స్న , ఎంఇఒ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ ,ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికల తయారీపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వైవి. నాగేశ్వర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఆద్యుడు ఎన్‌టిఆర్

తిరుపతిలో ఎన్‌టిఆర్‌కు ప్రకాశం ఎంఎల్‌ఎల నివాళి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఎన్టీఆర్ పాలన సాగించారని, తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని నలుగు దిశలా చాటిన తెలుగుజాతి వెలుగు శిఖరం ఎన్‌టిఆర్ అని టిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా తిరుపతిలో ఎన్టీఆర్ విగ్రహానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి, కొండేపి ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డివివి స్వామి, తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటరీ అభ్యర్థి పనబాక లక్ష్మీ, తిరుపతి ఇంచార్జ్ సుగుణమ్మతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఏలూరి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సమాజమే దేవాలయం, పేద ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశంను స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తెచ్చి చరిత్ర సృష్టించారని అన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో రూ.2కే కిలో బియ్యం అందించి పేదల కడుపు నింపాడని అన్నారు. పేదలకు పక్కా గృహాలు నిర్మించిన ఘనత ఎన్టీఆర్ దే అన్నారు. దేశంలో సంక్షేమ పాలనకు ఆద్యుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ కల నిజం చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. వెంకటగిరిలో ఈనెల 19న నిర్వహించనున్న రా కదలిరా బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

పంగులూరులో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి

పంగులూరు : తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సినిమా, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, గ్రామ అధ్యక్షుడు బాచిన త్రివేణి బాబు, బాచిన చౌదరి బాబు, చిలుకూరి వెంకట సుబ్బారావు (మేడ), జాగర్లమూడి బుచ్చయ్య, చిలుకూరి నాగేశ్వరరావు, అడ్డగిరి రాఘవరావు, పఠాన్ మస్తాన్ వలి, రాయిని మస్తానరావు పాల్గొన్నారు. మండలంలోని జాగర్ల మూడివారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి జాగర్లమూడి రవిశంకర్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. విశ్వ విఖ్యాత నటనా సార్వభౌమునిగా చిత్ర సీమకు, రాజకీయ రంగానికి ఎన్‌టిఆర్ వన్నె తెచ్చారని అన్నారు.

అద్దంకి ఎన్‌టిఆర్ వర్ధంతి సభలో మన్నం త్రిమూర్తులు

అద్దంకి : ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి కాకానిపాలెం మండపం ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభకు నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. మహిళలచే జండా ఆవిష్కరణ చేశారు. పేద మహిళా కళాకారిణిలకు పరిషత్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి సింగ్ సుబ్బాయమ్మ, పొడపాటి విజయలక్ష్మి, కాకాని లక్ష్మీ నాగేశ్వరమ్మ, కాకాని అమృతలక్ష్మి చేతుల మీదుగా నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో రాజకీయ, సినీ సద్విమర్శకులు అన్నమనేని వెంకటరావు, టిడిపి బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు నాగినేని రామకృష్ణ, బత్తుల రామకోటయ్య, బత్తుల రామకోటయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు, సంధిరెడ్డి శ్రీనివాసరావు, గోరంట్ల లక్ష్మందాసు, కాకాని అశోక్, కొండారావు రామారావు, బెజవాడ రామారావు, బొడ్డపాటి ఆదిత్య, మురకొండ శ్రీధర్, గోరంట్ల పేరయ్య, కంపా రజని, షేక్ జహీరా, అత్తులూరి రమేష్, కాకాని పెద్ద రంగారావు, షేక్ మాబు, రహిమాన్, మోహిద్దీన్, ఎం రంజిత్, మల్లాది నటరాజ్, సుధాకర్, రామాంజనేయులు, శ్రీను పాల్గొన్నారు.

యద్దనపూడిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి

యద్దనపూడి : మండలంలోని వింజనంపాడు, గన్నవరం, పెద్దివారిపాలెం, అనంతవరం, యద్దనపూడి గ్రామాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పులిహోరం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వంశీ, సుబ్బారావు, వెంకటరావు, అనిల్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంకొల్లు చెరువుకట్టపై ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి

ఇంకొల్లు : పర్చూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాత పోలీస్ స్టేషన్ మీదగా ర్యాలీగా నాగులు చెరువు కట్టపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చెరుకూరి రమేష్, పాలేరు రామకృష్ణ, ఇంద్ర శ్రీనివాసరావు, పంగులూరి హనుమయ్య, కందిమల్ల అనంతలక్ష్మి, మాధవి పాల్గొన్నారు. నాగండ్ల, గంగవరం, ఇడుపులపాడు, సూదివారిపాలెం, పూసపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అన్నదానం చేశారు.

చెరుకుపల్లి టిడిపి ఆఫీసులో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళి

చెరుకుపల్లి : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని కావూరు, గూడవల్లి, నడింపల్లి, కనగాల గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లూరులో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఘన నివాళి

కొల్లూరు : స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి నక్క ఆనందబాబు, టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్ పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మడి శివ, యార్లగడ్డ శ్రీనివాసరావు, గరికపూడి ప్రసాద్, మున్నంగి విజయ్ పాల్గొన్నారు.

ఎన్టీ రామారావుకు ఘన నివాళి

భట్టిప్రోలులో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి

భట్టిప్రోలు : మండలం ఐలవరం గ్రామంలో ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు, అత్తులూరి బాలకృష్ణ, దీపాల ప్రసాద్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, అనగాని ఏడుకొండలు, యశోద కృష్ణ, కొసనం రాఘవరావు పాల్గొన్నారు.

రేపల్లెలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఘన నివాళి

రేపల్లె : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ వర్ధంతి నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంక్షేమ పాలనకు ఆద్యుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఇసుకపల్లి, బేతపూడి సెంటర్లలో, రైల్వే స్టేషన్ వద్ద, 7వ వార్డులోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ వైద్యశాల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అనగాని శివప్రసాద్, పంతాని మురళీధరరావు, వీరవల్లి శివరామకృష్ణ, జివి నాగేశ్వరరావు, జిపి రామారావు, మేకా పూర్ణచంద్రరావు, షేక్ ఖాదర్ బాషా, దేవగిరి రవి, పంతాని సాయికుమార్, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, గుర్రం మురహరిరావు, కొపనాతి రాజశేఖర్, ఆలపాటి వేణు, వీరవల్లి శివరామకృష్ణ, దాసరి అమర్ నాథ్, దున్నా జయప్రద, నాగశ్రీరాణి, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, దొక్కు బుజ్జి, లాట్ కిషోర్, మద్దుల అంకాలు, తాడిపర్తి మల్లికార్జునరావు, తంగెళ్ళమూడి సాయిబాబు, యేమినేని యానాదిరావు, నీలి వెంకయ్య, కొడాలి సాంబశివరావు, మేకా రామకృష్ణ, కొండవీటి ప్రసాద్, ఆలూరి దానియేలు, ఆలూరి సురేష్, రేపల్లె సురేష్, నీలా కోటేశ్వరరావు, నల్లూరి అజయ్, గోగినేని శ్రీను, మద్దెల సాయిగోపి, బీమశంకరరావు, షేక్ కరిముల్లా, తురకా హనుమంతరావు, పరుచూరి విజయ్ కుమార్, చిలకా చంద్రబాబు, ఆదిన దునుంజయరావు, కారుమూరు ఆదిశేషు, రవి, అమర్తలూరి చంటి పాల్గొన్నారు.

బాపట్లలో ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమంలో నరేంద్రవర్మ

బాపట్ల : ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ స్థానం సుస్థిరమని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా టిడిపి నాయకులతో కలిసి పాత బస్టాండ్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన ఎన్టీఆర్ కారణజన్ములని అన్నారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు రూ.2లకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిన చరిత్ర ఎన్టీఆర్‌కే దక్కుతుందని అన్నారు.

పర్చూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బొమ్మల సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరన్నపాలెంలో నగాట క్రాప్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ గోరంట్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన గజమాలను ఎన్టీఆర్ విగ్రహానికి వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సంశుద్దీన్, ఎవి కృష్ణ, కొండగంటి శివ, కోడూరి శేష బ్రహ్మాచారి, చిట్టినేని రామకృష్ణ, మానవ హరిబాబు, కొల్ల బుజ్జిబాబు, శ్రీరామ్ వెంకటసుబ్బారావు, వీర్నపాలెంలో మాజీ ఎఎంసీ చైర్మన్ రామకృష్ణ, వై తులశమ్మ, ఎంపీటీసీ పి పద్మావతి, జి ప్రసాదు, జి రాఘవేంద్రరావు, జి శేషగిరిరావు పాల్గొన్నారు.

పర్చూరు మండలం వీరన్నపాలెంలో ఎన్‌టిఆర్‌కు నివాళి

కారంచేడులో ఎన్‌టిఆర్ విగ్రహానికి అక్కయ్యచౌదరి నివాళి

కారంచేడు : ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా స్థానిక కృష్ణ కాలువ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి, టిడిపి మండల అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీహరి, ఖాసిం, రావి శేషయ్య, రావి వీరయ్య చౌదరి, జరుబుల శ్రీనివాసు, కంభంపాటి నరేంద్ర, పోతూరి ఆదిలక్ష్మి, బోయిన శీను, పోతూరి శివరాం, యార్లగడ్డ సాయి కృష్ణ, విలేకర్ శీను పాల్గొన్నారు.

వేదరమెట్లలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నేతల నివాళి

వేదరమెట్ల : ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మూడు వేల మందికి అన్నదానం చేశారు. 40మందికిపైగా అభిమానులు రక్తదానం చేశారు. రావినూతల గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మేదరమెట్ల చెక్ పోస్ట్ సెంటర్లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

చీరాల : ఎన్టీఆర్ చరస్మరణీయులని, ఆయన సేవలు మరువలేనివని టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు తమ్ముళ్ళు, జన సైనికులు గడియార స్థంభం సెంటర్ నుండి బస్టాండు వరకు భారీ ర్యాలీ చేశారు. 2వేల మందికిపైగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తం, బొగ్గల పార్థసారధి, కౌతరపు జనార్ధనరావు, పొగడదండ రవికుమార్, పూర్ణ, నాసిక వీరభద్రయ్య, డేటా నాగేశ్వరరావు, వంక హరికృష్ణ, లావేటి శ్రీనివాసతేజ, ఉసిరిపాటి సురేష్, బాబు సయ్యద్, ఆవుల బాలాజీ, వినుకోట కిషోర్, గూడూరు శివరాం ప్రసాద్, కారంపూడి పద్మిని, సుబ్బలక్ష్మి కర్పూరపు, బుర్ర కవిత, ఆకురాతి సుజాత, శివనామల్లేశ్వరి ఎర్ర పాల్గొన్నారు.

చీరాలలో ఎన్‌టిఆర్ విగ్రహానికి కొండయ్య నివాళి

దగ్గుబాడులో అంగన్‌వాడీల ధర్నా

బెదిరింపులు మానుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

అధికారులు ప్రలోభపెట్టి, భయపెట్టి సమ్మెను విచ్చినం చేయాలనుకునే కుట్రలు మానుకోవాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హెచ్చరించారు. మండలంలోని దగ్గుబాడు గ్రామంలో గురువారం ఆందోళన చేశారు. అధికారుల ఒత్తిడితో దగ్గుబాడు అంగన్‌వాడి కేంద్రం వద్ద ఒక ఆయా విధులు హాజరైనట్లు తెలుసుకున్న కార్యకర్తలు ఆ కేంద్రం వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. దీంతో విధులకు హాజరైన ఆయా అక్కడ నుంచి వెళ్లిపోయింది. ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తున్న తమపై వత్తిడి తీసుకొస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దగ్గుబాడు, కారంచేడు రహదారిపై ధర్నా చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య, అనిత, హఫీజ్, కళ్యాణి, క్రీస్తు రాజ్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు దేవరపల్లి సన్మానం

కాంగ్రెస్ నేతలకు సన్మానం

ప్రజాశక్తి - చీరాల

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశానికి, రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని కాంగ్రెస్ ఇన్చార్జి దేవరపల్లి రంగారావు అన్నారు. బాపట్లలో జరిగిన జిల్లా సధస్సులో చీరాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలను వివిధ పదవుల్లో నియమించారు. స్థానిక డ్రైనేజీ అతిధి గృహంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ కేంద్రమంత్రి జెడీ శీలం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అంజిబాబు ఆదేశాలతో కాంగ్రెస్ గెలుపుకు కార్యకర్తలు పనిచేయాలని కోరారు. విశాఖ ఉక్కు, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, పోలవరం వంటివి దక్కాలంటే కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాని కావాలని అన్నారు. వైఎస్ షర్మిల పిసిసి అధ్యక్షురాలిగా ఈ నెల 21న బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. చీరాల నుండి కాంగ్రెస్‌లో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారిని సాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పేర్ల బుజ్జిరాజు, దాశి పీటర్ రమేష్, మేరిగ రమేష్ బాబు, కర్రెద్దుల సురేష్, యర్రాకుల శ్రీనివాసరావు యాదవ్, కుమార్ పాల్గొన్నారు.ం

ఆకతాయిలకు అడ్డాగా 'కార్యాలయాలు'

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. ఎక్కడ చూసినా తాగిపడేసిన ఖాళీ మద్యం సీసాలు దర్శనమి స్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల పరిసర ప్రాంతమంతా అపరిశుభ్ర తో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. మూత్రశాలలైతే కనీసం నవడలేని పరిస్థితి, పోలీసు నిఘా నీడలో పోలీస్ స్టేషన్, తహశీల్దారు, ఎంపీడీఓ కార్యాలయం, సబ్ రిజిస్టర్ ఆఫీస్, ఫైర్ స్టేషన్, కోర్టు, సబ్ జైల్ ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. జైలు ఎదురుగా ఉన్న చెత్తకుండీలో మద్యం బాటిళ్లు, డిస్పోజల్ గ్లాసులు, ఖాళీ వాటర్ బాటిళ్లు పడి ఉన్న దృశ్యాలు కనిపించాయి. మద్యం బాటిళ్లు దర్శనమివ్వడం విమర్శలకు తావిస్తోంది. మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది. కొందరు ఐదు, పది నిమిషాల్లో పని కానిచ్చేస్తే, మరి కొందరు గంటల తరబడి అక్కడే ఉంటున్నారు. మద్యం సీసాలను అక్కడే పగుల కొడుతుండటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. పోలీసులు తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ బహిరంగ మద్యపానం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నా మందుబాబుల్లో మాత్రం మార్పు రావడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వంద యూనిట్ల రక్తం సేకరణ

బాపట్ల ప్రభుత్వ వైద్యశాల్లో రక్తదాన శిభిరం

ప్రజాశక్తి - బాపట్ల

విజయవాడ స్వరాజ్ మైదానంలో 125అడుగుల ఎత్తులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ విజయోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు డిఎం అండ్ హెచ్ఓ ఎస్ విజయమ్మ తెలిపారు. మార్టూరు, రేపల్లె, బాపట్ల అంబేద్కర్ భవనంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు నియోజకవర్గ కేంద్రాల్లో వంద యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి సివి రమాదేవి, జిల్లా ఆసుప్రతుల సమన్వయ అధికారి డాక్టర్ శేషుకుమార్, జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ షేక్ మొహమ్మద్ సాధిక్, జిల్లా క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ సయ్యద్ జానీభాషా, బాపట్ల ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ మహేష్, చీరాల ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాజ సిలువన్, సిబ్బంది, డిఎస్ఓ మార్గరేట్ పాల్గొన్నారు.

బాపట్ల : ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా బాపట్ల పార్లమెంటు టిడిపి టికెట్ ఆశిస్తున్న దగ్గుమళ్ళ ప్రసాదరావు సహకారంతో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో సాహితీవేత్త బీరం సుందరరావు శిభిరాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ సినీ రంగానికి, ప్రజా సేవకు అంకితమైన కారణజన్ముడని కొనియాడారు. రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి బిఎస్ నారాయణ భట్టు మాట్లాడుతూ ఎన్టీఆర్ నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన దీక్ష దక్షుడన్నారు. తెనాలి కిచెందిన కూచిపూడి నృత్య కళాకారిణి చిరంజీవి, షేక్ తహసీన్ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో బీసీ నాయకులు ఉప్పాల మురళి, కరీముల్లా, దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొన్నారు.

టిడిపి దగ్గుమళ్ల ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం

నాటు సారా విక్రయాలకు పాల్పడితే కఠినచర్యలు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద గ్యాంగ్, చిన్న బేతపూడి, వృక్షనగర్ ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ గురువారం నిర్వహించారు. బాపట్ల డిఎస్పి టి వెంకటేశు లు పర్యవేక్షణలో ట్రైనీ డిఎస్పి విద్య, పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, సెబ్ సిఐ శ్రీనివాసులు, వెదుళ్ళపల్లి, బాపట్ల రూరల్, చందోలు, బాపట్ల సెబ్ ఎస్సైలు, 40మంది పోలీస్ సిబ్బంది ఇంటింటినీ జల్లెడ పట్టారు. 2,500లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 25లీటర్ల నాటు సారా, 3కేజీల కరక్కాయలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ నాటు సారా, అక్రమ మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసే లక్ష్యంతో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత సమాచారం తెలిస్తే ఎస్‌హెచ్ఓకుగాని, 100, 112 నెంబర్లకు, హెల్ప్ లైన్ 8333813228కు కాల్ చేసి చెప్పాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వెదుళ్లపల్లి స్టేషన్ పరిధిలో బెల్లం ఊట ధ్వంసం

విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

గవినివారిపాలెం ఘటనలో ఇద్దరు యువకులు అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

మత పరమైన సున్నితమైన అంశాల్లో వీడియోలు పోస్ట్ చేయటం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని డిఎస్పి ప్రసాదరావు హెచ్చరించారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న గవినివారిపాలెంలో చెన్నై నుండి కొంత మంది యువకులు సువార్త పరిచర్య చేస్తున్న తరుణంలో గ్రామానికి చెందిన వెంకట్రావు, అయ్యప్ప అనే ఇద్దరు యువకులు క్రైస్తవ మతంపై దుర్భాషలాడినట్లు తెలిపారు. వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు ఆ యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా 14రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఘటన వెనక ఎలాంటి సంస్థల ప్రభావం లేదని, మత ప్రచారంలో తలెత్తిన భేదాభిప్రాయాల సంభాషణ మాత్రమేనని అన్నారు. పోలీస్ 30యాక్ట్ అమలులో ఉన్నందున చట్టాన్ని ఉల్లంఘిస్తూ జాతీయ రహదారిని దిగ్బంధం చేసిన వారిలో 47మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చట్టానికి అందరూ సమానమేనని అన్నారు. ఇలాంటి ఘటనల్లో సంయమనం పాటించాలని కోరారు. సమావేశంలో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఈపురిపాలెం ఎస్ఐ జనార్ధన్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో డిఎస్పి ప్రసాదరావు

అంబేద్కర్ విగ్రహావిష్కరణ అభినందనీయం

ప్రజాశక్తి - పర్చూరు

అమరావతిలో స్మృతి వనం నిర్మిస్తామని దళితులను టిడిపి ప్రభుత్వం మోసం చేసిందని దళిత న నాయకులు ఆరోపించారు. స్థానిక బొమ్మల సెంటర్లోని అంబే ద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం విలేఖరులతో మాట్లాడారు. దశాబ్దాలుగా పాలకులు దళితులను మోసం చేస్తూనే ఉన్నారని దళిత నాయకులు కూరాకుల ఇస్సాకు ఆరోపించారు. 125అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్న ఏకైక సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరూ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలి రావాలని కోరారు. దళిత నాయకులు నూతలపాటి బలరాం, జూపూడి రోశయ్య, ఎడ్లపల్లి జయరాజు, వై రమేష్, శానం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిఎంకు దళిత సంఘాల అభినందనలు

అరెస్టు అక్రమమని తేలిపోయింది

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎంఎల్ఎ ఏలూరి

చంద్రబాబు అరెస్టు అక్రమమని సుప్రీం కోర్టు అభిప్రాయ పడిందని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తిస్తుందన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండానే ఆయన్ను అరెస్టు చేశారని గుర్తు చేశారు. గవర్నర్ వద్ద ముందస్తు అను మతి తీసుకోవాల్సి ఉండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఉద్దేశ పూర్వకంగానే అరెస్టు చేశారన్నారు. అవినీతి నిరోధక చట్టం సవరణ ద్వారా వచ్చిన సెక్షన్ 17 ఏ అమల్లోకి రావడానికి ముందు అనగా 2018 జూన్ 22న చంద్రబాబుపై ఏ రకమైన విచారణ, దర్యాప్తు పరిశోధన జరగలేదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొందని అన్నారు.

సమావేశంలో ఎంపిపి లలితకుమారి

బడ్జెట్ తయారు చేసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పంచాయతీకి వచ్చే ఆదాయం, ఖర్చులకు అనుగుణంగా 15ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం బడ్జెట్ తయారు చేసుకోవాలని ఎంపీపీ డివి లలిత కుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో జిపిడిపి శిక్షణ నిర్వహించారు. 2024 - 25ఏడాదికి ఆర్థిక అభివృద్ధి ప్రణాళికను తయారు చేసుకోవాల్సి ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పంచాయతీకి లభించే ఆదాయం, వెచ్చించే ఖర్చులతో సహా బేరీజు వేసుకుని ప్రాణాళిక సిద్ధం చేసుకోవాల్సి ఉందన్నారు. జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా బడ్జెట్ తయారయ్యే విధంగా చూసుకోవాలన్నారు.

సంతకాలు సేకరిస్తున్న నాయకులు

అంగన్‌వాడీ సమ్మెకు మద్దతుగా

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత 38 రోజుల నుంచి జరుగుతున్నటువంటి అంగన్వాడీల సమ్మెకు పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా గురువారం ఏ బీ ఎమ్ కాలేజీ గ్రౌండ్లో ప్రజల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం కెవిపిఎస్ ఒంగోలు నగర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్ మాట్లాడుతూ అంగన్వాడీలో చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజల మద్దతు కావాలని దానిలో భాగంగానే ఈ సంతకాల సేకరణ కార్యక్రమం చేస్తున్నామని తెలియజేశారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందుగా బెదిరింపులకు దిగటం సరైనది కాదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, అత్తంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

21న 'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం ప్రసంగాల సంకలనం 'మండలి మాస్టారు' పుస్తకావిష్కరణ సభ గుంటూరు ఎన్జీవో కళ్యాణ మండపంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జరుగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు. స్థానిక జెవివి జిల్లా కార్యాలయం ఎల్‌బిజి భవన్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు హాజరవుతారని, ఈ పుస్తక పరిచయం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చేస్తారన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం 'ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ అభివృద్ధి' సదస్సు జరుగుతుందని, ఈ సదస్సులో వివిధ అంశాలపై ప్రొఫెసర్ వెంకటేష్ ఆత్రేయ (మదురై విశ్వవిద్యాలయం), డాక్టర్ ఏ.సుబ్బరామిరెడ్డి (డైరెక్టర్- ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం), డాక్టర్ ఎం గేయానంద్(జెవివి రాష్ట్ర అధ్యక్షులు) ఉపన్యసిస్తారన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు యస్.రవి మాట్లాడుతూ బాలసుబ్రమణ్యం సమాజం పట్ల స్పష్టమైన అవగాహన, సామాజిక దక్పథం కలిగిన విద్యావేత్త అని, 16 ఏళ్ళ శాసన మండలి సభ్యునిగా పనిచేశారన్నారు. ఈ కాలంలో విఠపు బాలసుబ్రమణ్యం విద్యారంగంతో పాటుగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు, వివిధ సామాజిక అంశాలపైన శాసనమండలిలో చేసిన ఉపన్యాసాల సంకలనంగా 'మండలిలో మాస్టారు' పుస్తకం ప్రచురించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి, సదస్సుకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యావంతులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్, కోశాధికారి బి.తిరుపతయ్య, రోటరీ క్లబ్ జిల్లా ఛైర్మన్ బండారు లక్ష్మీ నారాయణ, యు.టి.ఎఫ్- జె.వి.వి నాయకులు కె.సుబ్రహ్మణ్యం, ఎస్‌కె ఖాజా హుస్సేన్, నల్లూరి వెంకటేశ్వరరావు, జి.ఉమామహేశ్వరి, యస్.వి.రంగారెడ్డి, మాలకొండయ్య, డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల పార్లమెంట్ టిడిపి టిక్కెట్ ఎవరికో..?

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల పార్లమెంట్ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసేందుకు అత్యధికులు పోటీ పడుతున్నారు. బాపట్ల ఎస్సీలకు రిజర్వు అయిన క్రమంలో ఆర్థిక స్తోమత ఉన్న మాల, మాదిగ సామాజికవర్గాలకు చెందిన మాజీ ఉద్యోగులు పలువురు టిడిపి టిక్కెట్‌ను ఆశిస్తూ ఉన్నతస్థాయిలో తమకు ఉన్న పరిచయాలతో టిక్కెట్ సాధన కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బాపట్ల నుంచి వైసిపి తరపున పోటీ చేసిన నందిగం సురేష్ గెలుపొందారు. జరగనున్న ఎన్నికల్లో కూడా సురేష్‌నే ఆ పార్టీ అధిష్టానం తిరిగి పోటీలో నిలుపుతున్నట్లు చెబుతున్నారు. సురేష్ మినహా మరెవరూ కూడా వైసిపి నుంచి బాపట్ల పార్లమెంట్‌కు పోటీ చేసేందుకు ముందుకు రాలేదని తెలుస్తోంది. గత ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ నుంచి వైసిపి అభ్యర్థి గెలుపొందినప్పటికి మెజారిటీ స్థానాల్లో అసెంబ్లీ నుంచి టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. అద్దంకి, పర్చూరు, చీరాల, రేపల్లె అసెంబ్లీ స్థానాల నుంచి టిడిపి అభ్యర్థులు గెలుపొందగా, సంతనూతలపాడు, బాపట్ల, వేమూరు నుంచి వైసిపి అభ్యర్థులు గెలిచారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయన్న కారణంతో బాపట్ల పార్లమెంట్ టిడిపి టిక్కెట్ తెచ్చుకుంటే చాలు గెలవగలమన్న నమ్మకంతో ఇప్పటికే రాజకీయాల్లో ఉన్న వారితో పాటు పలువురు ఔత్సాహికులు బాపట్ల నుంచి రాజకీయరంగ ప్రవేశం చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇందులో ఉద్యోగ విరమణ చేసిన సివిల్ సర్వీసెస్ అధికారులతో పాటు

గతంలో పోటీ చేసిన వారు కూడా ఉన్నారు. 2009లో కాంగ్రెస్ తరపున బాపట్ల నుంచి గెలిచి ప్రస్తుతం టిడిపిలో ఉన్న పనబాక లక్ష్మి, 2014లో టిడిపి తరపున బాపట్ల ఎంపీగా గెలిచి 2019 ఎన్నికల్లో ఓడిపోయిన శ్రీరాం మాల్యాద్రి ఈ పర్యాయం టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎంపీ సలగల బెంజిమన్ కుమారుడు సలగల రాజశేఖర్ కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. ఇటీవలే వైసిపిని వీడి టిడిపిలో చేరిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కూడా బాపట్ల టిక్కెట్ కోరుతున్నారు. ఇటీవల తుపాను వల్ల పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటించగా శ్రీదేవి కూడా పర్యటనలో పాల్గొన్నారు.

మాదిగ వర్గీయులవైపే మొగ్గు..!

బాపట్ల పార్లమెంట్ స్థానం నుంచి టిడిపి అధిష్టానం ఈ పర్యాయం మాదిగ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థినే ఎన్నికల బరిలో నిలపనున్నట్లు సమాచారం. సుదీర్ఘకాలంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన టిడిపికి అండగా ఉంటూ వచ్చారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కుల సమీకరణల్లో భాగంగా ఈ పర్యాయం బాపట్ల నుంచి ఈ వర్గానికి చెందిన వారిని పోటీలో నిలపాలన్నది టిడిపి అధిష్టానం నిర్ణయంగా తెలుస్తోంది. ఈ కారణంగానే మాల సామాజికవర్గానికి చెందిన వారెవరికీ పార్టీ నేతలు ఎలాంటి హామీలు ఇవ్వడం లేదు. మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు ఇటీవల బాపట్ల పార్లమెంట్ టిక్కెట్‌ను ఆశిస్తూ అధిష్టానంలోని పెద్దలను కలువగా ఇదే విషయం చెప్పారు. అయితే తనకు టిక్కెట్ వస్తుందన్న ధీమాతో బాపట్లలో ప్రజాపరిచయ వేదిక పేరుతో సభ జరిపారు. అయితే ఈ సభకు జిల్లా నుంచి పార్టీ ముఖ్య నేతలు గానీ, పార్టీ నియోజక ఇన్‌ఛార్జీలు గానీ హాజరుకాలేదు. తాము ముందే చెప్పినప్పటికి బాపట్లలో టిడిపి జెండాలు, ఫ్లెక్సీలతో ఇలా సభ జరపడం వలన రానున్న రోజుల్లో ఇబ్బందులు వస్తాయన్న ఆలోచనతో పార్టీ పెద్దలు సదరు సభకు హాజరుకావద్దని టిడిపి క్యాడర్‌కు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. బాపట్ల పార్లమెంట్ టిడిపి టిక్కెట్ ఏ సామాజికవర్గానికి ఇవ్వనున్నారో స్పష్టం కావడంతో ఆ వర్గానికి చెందిన వారు క్యూ కట్టారు. పలువురు మాజీ ఉన్నతాధికారులతో పాటు పోలీసు అధికారి ఒకరు టిక్కెట్ ఆశిస్తూ పార్టీ పెద్దలను కలిశారు. వీరిలో ఆర్థికంగా శక్తిమంతులుగా ఉన్నవారిని టిడిపి అధిష్టానం ఎన్నికల బరిలో నిలపనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి లేదా పోలీస్ అధికారి బాపట్ల పార్లమెంట్ నుంచి ఎన్నికల బరిలో ఉండే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

20న రాస్తారోకోను జయప్రదం చేయండి

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో అంగన్‌వాడీ సమ్మెకు మద్దతుగా ఈ నెల 20న జరిగే రాస్తారోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ మాట్లాడారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి రాష్ట్రప్రభుత్వం కావాల్సిన ప్రయత్నాలు మొత్తం చేసిందన్నారు. చివరికి ఎస్మా ప్రయోగించిందన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక, ప్రజాసంఘాలు రాష్ట్రవ్యాప్తంగా 20వ తేదీన రాస్తారోకో చేపట్టాలని నిర్ణయించాయన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాలు, అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాలు, అనుబంధ సంఘాలు, అభ్యుదయ సంఘాలు అంగన్వాడీ సమ్మెకు మద్దతు పలికే అన్ని సంఘాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న జి.శ్రీనివాసులు

పేదలకు సొంతిల్లు ఉండేలా చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అర్హులైన పేదలందరికీ సొంతిల్లు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ దిశగా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వినియోగించుకుని త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు ఆయన పిలుపునిచ్చారు. 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు' పథకంలో లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ డబ్బులను వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్న సందర్భంగా గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును ఆయన అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్న 39,541 మంది ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేల చొప్పున రూ.139.30 కోట్ల విలువైన రుణాలను అందించామన్నారు. వీరిలో ప్రస్తుతం 11,141 మంది లబ్ధిదారులకు మొదటి విడతలో రూ.1,18,51,393ల వడ్డీని రీయింబర్స్ చేస్తున్నట్లు తెలిపారు. ఇలా సంవత్సరంలో రెండుసార్లు వడ్డీ రీయింబర్స్ చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 74 వేల వరకు ఇళ్లను మంజూరు చేశామని, వీటిలో ఇప్పటివరకు 24 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ళు కూడా త్వరగా పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. ఆర్థికంగా, మౌలికపరంగా ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని వినియోగించుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఈమని పీరయ్య, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. రవికుమార్‌తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అట్టడుగు వర్గాల వారికి అధికారం కోసం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కొనియాడారు. అంబేద్కర్ చూపిన మార్గంలో బడుగు, బలహీన వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యం కల్పిస్తున్నారని ఆయన చెప్పారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 'సామాజిక న్యాయ మహాశిల్పాన్ని' శుక్రవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న నేపథ్యంలో 'సామాజిక సమతా సంకల్పం' కార్యక్రమ మహోత్సవంలో భాగంగా గురువారం ఒంగోలులో చేపట్టిన కార్యక్రమాలలో మంత్రితో పాటు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. తొలుత హెచ్‌సిఎం కాలేజీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంత్రి, మేయర్, ఇతర అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోలాటం, డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీగా కొలాన్ హోటల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు వచ్చి పూల మాల వేసి నివాళులర్పించి మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక సభా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తూ బడుగు, బలహీన వర్గాలకు చట్ట సభలలో మెరుగైన ప్రాతినిధ్యం కల్పించడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నాడు బలహీన వర్గాలకు ఆలయాలలోకి ప్రవేశం ఉండేది కాదని, కానీ నేడు ఏకంగా ఆలయ ధర్మకర్తల మండలిలో ఈ వర్గాల వారికి ముఖ్యమంత్రి స్థానం కల్పిస్తున్నారన్నారు. పేదలందరికీ విద్య, వైద్యం, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారని మంత్రి సురేష్ తెలిపారు. విద్యా హక్కు చట్టాన్ని పేదలకు ఉచిత ఇంగ్లీష్ విద్య స్థాయికి ముఖ్యమంత్రి తీసుకువెళ్లారన్నారు. ఆత్మస్థైర్యంతో బడుగు, బలహీన వర్గాలు ముందడుగు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా పరంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంబేద్కర్ స్ఫూర్తితో మరింత ముందుకు సాగేలా బెజవాడ నడిబొడ్డున నిర్మించిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ విజ్ఞానం, అభ్యుదయ భావం, పోరాట పటిమకు నిదర్శనమైన అంబేద్కర్ ప్రతిమను చరిత్రలో నిలిచిపోయేలా ఆవిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అంబేద్కర్ అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, భవిష్యత్తు తరాలకు అంబేద్కర్ గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ బడుగుల రాజ్యాధికారం కోసం అంబేద్కర్ కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరికీ ఎన్నికలలో పోటీ చేసే హక్కు, ఓటు హక్కును రాజ్యాంగబద్ధం చేసిన మహనీయుడన్నారు. అంబేద్కర్ అడుగు జాడలలో బడుగు, బలహీన వర్గాల వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేసేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.